సంపాదకీయం

# సంఘ్ పరివార్‌ను గట్టిగా ఎదుర్కోవడం అవసరం

సంఘ్ పరివార్‌ను దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రధాన శత్రువుగా ప్రకటించే రోజు వచ్చింది.

సిద్ధాంతరీత్యా ఈ అభిప్రాయం హక్కుల ఉద్యమంలో పనిచేసే వారిలో చాలా మందికి ముందునుండి వుంది. కానీ ఇప్పుడు వారి ఆచరణతో వారే ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నారు.

దేశంలో విశాల భూభాగాన్ని వారి రౌడీమూకలిప్పుడు నిరాఘాటంగా ఏలుతున్నాయి. అన్ని నాగరికతా నియమాలకు విరుద్ధంగా, అన్ని ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా ఏలుతున్నాయి. వేరే ఎవరైనా ఈ సాహసం చేస్తే పోలీసు కాల్పులనూ తెల్లబట్టల సమాజం విమర్శనూ ఎదుర్కోవలసి వస్తుంది. కానీ ఈ కాషాయం రౌడీలమీద లాఠీలు, తుపాకులు ఎక్కుపెట్టడానికి పోలీసులకూ పారామిలిటరీకీ చేతులు రావడంలేదు. మేధావులు అని పిలవబడే వారిలో వీరిని విమర్శించేవారు కొందరయితే వీరి రౌడీయిజాన్ని సమర్ధిస్తూ మాట్లాడేవారే ఎక్కువయ్యారు. ప్రభుత్వాలు వీరివైన రాష్ట్రాలలోనే కాదు, కాని రాష్ట్రాలలో కూడ వీరి ఆగడాలు యథేచ్ఛగా సాగుతున్నాయంటే వీరిపట్ల 'సాఫ్ట్‌కార్నర్' అధికారగణంలోనూ మర్యాదస్తుల 'సభ్య సమాజం'లోనూ ఎంతగా పెరిగిందో అర్థం అవుతుంది.

అయినా, అధికారగణం వీరిని అణచివేయడం ఈ దౌర్జన్యానికి పరిష్కారం అని మేము భావించడం లేదు. ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో వీరి అనాగరిక ఆలోచనా రీతినీ, నడవడికనూ తిరస్కరించడం అవసరం. నిజానికి ఒక దశాబ్ద కాలంగా ద్వేషాన్ని రెచ్చగొట్టీ

రెచ్చగొట్టీ వీళ్లు సాధించిన 'ప్రజాబలం' స్వల్పమేగానీ, అధికార యంత్రాంగం సహాయ సహకారాల వల్ల వీరు విచ్చలవిడిగా చెలరేగగలుగుతున్నారు. వీరికున్న కొద్దిపాటి బలాన్నీ, అధికార యంత్రాంగం అందిస్తున్న సహకారాన్నీ కలిపి ఎదుర్కొనే ప్రజాస్వామిక శక్తిని మనం పెంపొందించుకోవడం అవసరం.

తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్‌లో బుద్ధుడి విగ్రహాలనొక పథకం ప్రకారం పేల్చేసినందుకు నాగరికతను ప్రేమించే వాళ్లంతా అసహ్యించుకోగా, తగుదునమ్మా అంటూ అద్వానీ వంటి వారు కూడా మనతో గొంతు కలిపారు. విగ్రహాలను పనిగట్టుకొని పేల్చివేయడం అనాగరికమైతే, మనుషులను సజీవంగా దహనం చేయడాన్ని ఏమనాలి? ఒకరిని కాదు, ఇద్దరిని కాదు, కనీసం వెయ్యి మందిని గుజరాత్‌లో నిస్సహాయులను చేసి పోలీసులు చోద్యం చూస్తుండగా నరికి చంపారు. తగలబెట్టి చంపారు. అధికారం తమ చేతిలో వుండడాన్ని ఆసరా చేసుకొని తాము రక్షించవలసిన పౌరులను తమ వారి చేతనే ఊచకోత కోసి చంపించారు.

రెండేళ్ల కింద ఆగస్ట్ 28న హైదరాబాద్‌లో ఏం జరిగిందో జ్ఞాపకం వుంది కదా? ప్రజలందరికీ - వర్గాలతో నిమిత్తం లేకుండ - ఆందోళన కలిగించిన కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఊరేగింపు తీస్తే వారిని అసెంబ్లీ దరిదాపులకు రానీయకుండ బ్యారికేడ్లు కట్టి ఆపారు. బ్యారికేడ్లు దాటి ముందుకొస్తారేమోనన్న అనుమానం వచ్చిన క్షణం కాల్పులు జరిపారు. లాఠీలతో కొట్టారు. నలుగురిని చంపారు.

ఇంకా కొంతకాలం ముందు నాగపూర్‌లో ఒక ఆదివాసీ తెగకు చెందినవారు అసెంబ్లీ సమావేశం జరుగుతుండగా ఊరేగింపు తీసారు. తమ తెగపేరు ఎస్.టి. జాబితా నుండి తీసేయడాన్ని నిరసిస్తూ ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించే ఉద్దేశ్యంతో ఊరేగింపు తీశారు. అధికార యంత్రాంగం అసెంబ్లీకి ఒకటి రెండు కిలోమీటర్ల దూరాన బ్యారికేడ్లు కట్టారు. బ్యారికేడ్ల దగ్గరికి గుంపుగా వచ్చిన ఆదివాసీలను నిలువరించారు. వెనుక నుండి జనం తోసుకురావడం వల్ల బ్యారికేడ్ల దగ్గర తొక్కిసలాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి జనాన్ని చెదరగొట్టి తొక్కిసలాటను తీవ్రతరం చేశారు. ఆ రోజు కనీసం వంద మంది చనిపోయారు.

ఇటువంటి ఘటనలు - ఇన్ని ప్రాణాలు అన్ని సందర్భాలలోనూ పోకపోవచ్చునుగాక - సుపరిచితమే. అసెంబ్లీ లేక పార్లమెంటు దరిదాపులకు ఊరేగింపు తీయడం సాధ్యంకాదని మనకందరికీ తెలుసును. కానీ మొన్న ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లో ఏమయింది? అసెంబ్లీలో ఎవరో ఒక ఎమ్మెల్యే సంఘ్ పరివార్‌ను విమర్శిస్తూ మాట్లాడాడని చెప్పి సంఘ్ పరివార్ గుండాల మూక అసెంబ్లీపైన దాడిచేసి బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి వున్నట్టు, నాగపూర్ అసెంబ్లీకి వున్నట్టు, ఒరిస్సా అసెంబ్లీకి కూడ సెక్యూరిటీ వుంది. సాయుధ పోలీసు పహారా వుంది. అసెంబ్లీ దరిదాపులలో ఎవరూ ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించడానికి వీలులేదన్న నియమం వుంది. అదేదీ సంఘ్ పరివార్ దాదాగిరీకి అడ్డంరాలేదు. అడ్డం రావద్దని ఎవరైనా ఆదేశం ఇచ్చారో, లేక

హిందుత్వం పేరు మీద జరిగే దౌర్జన్యానికి పెరిగిన ఆమోదం ఆపిందో తెలీదు.

బెంగుళూరు సమావేశంలో ఆర్.ఎస్.ఎస్. అధినేతలు ముస్లింలను బెదిరించిన విషయం చర్చకొచ్చింది గానీ వారికి బలం వున్న ప్రాంతంలో ఇది చాలా కాలంగా మౌనంగా సాగుతూనే వుంది. 'మా కాళ్లమీద పడితేనే మీరు క్షేమంగా వుంటారు' అన్న సంకేతం ముస్లింలకు వారి నుండి ఎప్పుడో అందింది. మహారాష్ట్రలో ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో వాళ్లే శివసేనకు ఓట్లువేసి బాల్‌థాకరే అపార్థం చేసుకోకుండా జాగ్రత్తపడుతూ 'క్షేమంగా' బతుకుతున్నారు.

ఈ మాత్రం దాదాగిరీ వేరే ఎవ్వరూ చేయలేక కాదు. వృత్తి రౌడీలకు అవకాశం ఇస్తే ఇంతకంటె సమర్థంగా చేయగలరు. వీరికి సాగుతున్నది కాబట్టి రెచ్చిపోయి చేస్తున్నారు.సాగుతుండడానికి గల రాజకీయ కారణాన్ని గుర్తించడం సులభమే, విమర్శించడమూ సులభమే. సంఘ్ పరివార్ రాజకీయ ముఖమైన బిజెపి కేంద్రంలో అధికారంలో వుంది. ఆ పార్టీతో కేంద్రంలో చెలిమి వున్న పార్టీలు ఇక్కడొక రాష్ట్రాన్నీ అక్కడొక రాష్ట్రాన్నీ ఏలుతున్నాయి. అటువంటి వారిని ఏమనడానికీ అధికార యంత్రాంగానికి చేతులాడవు.

కానీ అంతకంటె లోతయిన కారణమూ వుంది. భారతదేశం లౌకికవాదాన్నీ ప్రజాస్వామ్యాన్నీ ఎంచుకోవడం వల్ల 'హిందువులకు' ఏదో అన్యాయం జరిగి పోయిందని నమ్మేవాళ్లు ఈ దేశంలో ఇప్పుడు చాలా మంది వున్నారు. వారంతా కాషాయాంబరధారులూ కాదు, ఖాకీ నిక్కరు యోధులూ కాదు. ఇతరత్రా ఆధునికులుగా కనిపించే వారిలో చాలామంది ఈరకమైన అభిప్రాయాలు కలిగి వున్నారు. వాళ్లు పాకిస్తాన్‌నూ సౌదీ అరేబియానూ చూసి నిట్టూర్పులు విడుస్తుంటారు. ఇస్లాం పేరు మీద నడిచే అతివాదాన్ని గట్టిగా ఎదుర్కొంటున్న ఇండొనీషియా, టర్కీ, ఈజిప్టు వంటి ముస్లిం మెజారిటీ దేశాలను వారు చూడరు. వారు ఇండియాను పోల్చుకొని బాధపడేది పాకిస్తాన్‌తో, సౌదీ అరేబియాతో, ఇరాన్‌తో మాత్రమే.

ఇంతదూరం పోయేవారు ఎక్కువ మంది లేకపోవచ్చును గానీ, లౌకికవాదాన్ని భారత్ ఎంచుకోవడం వల్ల 'దెబ్బతిన్న' హిందువుల ప్రయోజనాలు బజరంగ్‌దళ్ రూపంలోనూ, విశ్వహిందూ పరిషత్ రూపంలోనూ, ఆర్.ఎస్.ఎస్. రూపంలోనూ 'కాపాడబడటం' సానుభూతితో 'అర్థం చేసుకోవలసిన' విషయం అని నమ్మేవారు చాలామంది తయారయ్యారు. వీరు అధికార యంత్రాంగంలో వున్నారు, ప్రొఫెసర్లలో వున్నారు, పత్రికా సంపాదకులలోనూ వున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎదుర్కోవలసింది ఈ మెతక వైఖరిని. లౌకికవాదాన్ని భారత్ ఒక విధానంగా ఎంచుకోవడం వల్ల దేశానికి చాలా మేలే జరిగింది తప్ప నష్టం జరగలేదు. కేవలం ముస్లింలకూ క్రైస్తవులకే కాదు, 'హిందువులు' అని పిలవబడే వారిలో మెజారిటీకి – స్త్రీలకు, దళిత బహుజన కులాలకూ కూడా మేలే జరిగింది. అదే లేకపోతే ఆ ప్రజానీకమంతా కూడా సంప్రదాయక హైందవ సంస్కృత పిడికిట్లో నలుగుతుండేవారు.

కొంతమేరకైనా ఆ అణచివేత నుండి బయట పడగలిగారంటే లౌకికవాద స్ఫూర్తితో రాజ్యాంగం సమానతా హక్కులూ అవకాశాలూ ఇవ్వడమే దానికి కారణం. ఇంకా సంపూర్ణంగా ఆ హక్కులకూ అవకాశాలకూ – ముఖ్యంగా స్త్రీల విషయంలో – వ్యవస్థిత రూపం ఇవ్వలేదన్నది ఫిర్యాదవుతుందిగానీ ఆ మాత్రం సమానతా అవకాశాలు వుండడం 'హిందువులకు నష్టకరం' అనేది అర్థరహితమయిన ఫిర్యాదు. ఇస్లాం పేరుమీద లౌకికవాదాన్ని తిరస్కరించిన దేశాలలో ప్రధానంగా నష్టపోయింది ముస్లిం స్త్రీలే కదా?

'హిందువులు' నష్టపోయారు, 'హిందువుల' ప్రయోజనాలు దెబ్బతిన్నాయి మొదలయిన ఫిర్యాదులలో 'హిందువులు' అంటే అర్థం హైందవ పెత్తందారీ కులాలు, అందులో మగవాళ్లు అని. ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నప్పుడు హిందుత్వవాదుల ఆగడాల పట్ల చాలామంది అనాలోచితంగా ప్రదర్శిస్తున్న మెతక వైఖరికి సహేతుకమైన కారణమేమీ లేకపోగా, అది ముస్లింలకూ, క్రైస్తవులకే కాక ఈ దేశంలోని అత్యధిక మెజారిటీ ప్రజానీకానికి హానికరం అని గుర్తించగలుగుతాం.

– మానవహక్కుల వేదిక

26.3.2002